క్లుప్తంగా

వైభవంగా ఉరుసు మహోత్సవం



ఉరుసు మహోత్సవం సందర్భంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తంగెళ్ళమూడి రాణీ నగర్‌లోని హజరత్ నజీముల్లా హజారీ రహంతుల్లా మహాత్ముని ఉరుసు మహోత్సవాలు గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఫాతెహా ఖానీ భక్తి శ్రద్ధలతో నిర్వహించగా అనంతరం మత పెద్దలు దువా ప్రార్థనలు జరిపారు. అనంతరం దర్గా వంశపారంపర్య ముజావరు ఖాజా హుస్సేన్, పాత మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది హిందూ, ముస్లింలు పాల్గొని మహాత్ముని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి కూడళ్లను దాటే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్ బాబు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. మనం ఎంత సక్రమంగా వాహనాలు నడుపుతున్నా ఊహించని ప్రమాదాలు ఎన్నో పొంచి ఉంటాయని, చాలా మెలకువతో వ్యవహరించినప్పుడు మాత్రమే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత వైద్యురాలు జీ మౌనిక, కళాశాల ప్రిన్సిపాల్ పీ బాలకృష్ణ ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మంచినీటి సరఫరా వేళల్లో మార్పులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 10వ తేదీన (శనివారం) సాయంత్రం కొన్ని ప్రత్యేక కారణాలతో నీటి సరఫరా వేళల్లో మార్పు చేసినట్లు ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం తాగునీటి సరఫరా 6.30 గంటలకు బదులుగా రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. ఏలూరు నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, చిత్రంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు

ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా బీసీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ రాజకీయ, సామాజిక సమతుల్యానికి విశేష కృషి చేస్తున్నారని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు తెలిపారు. ఏలూరు ఆర్‌ఆర్ పేటలోని రవి స్వీట్‌హోం ఎదురుగా ప్రైవేటు ఫంక్షన్ హాలులో నగరంలోని కొప్పులవెలమ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు రవిస్వీట్స్ హోం రంగారావుతో కలిసి గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని, ఏలూరు నియోజకవర్గంలో బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్ళ నానికి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. అదే విధంగా పార్టీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను నియమించారని, ఆయన విజయానికి బీసీ వర్గాలన్నీ ఐక్యంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు ఏలూరు ఎంపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించడం పట్ల బీసీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి, కొప్పుల వెలమ సంఘ పెద్దలు, జిల్లా నాయకులు ఉన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నెరుసు నాగ సత్యం యాదవ్

ఏలూరు (టూటౌన్): రాజ్యసభకు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఖరారైన సందర్భంగా మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు సభ్యులు నెరుసు నాగసత్యం యాదవ్ గురువారం తాడేపల్లిలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీ సుబ్బారెడ్డి రాబోయే రోజుల్లో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్



ఏలూరు ఇందిరమ్మ కాలనీలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్

ఏలూరు టౌన్: ప్రతి పౌరుడు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకుని ప్రజలకు సుపరిపాలన అందించే వారినే ఎన్నుకోవాలని వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్ కోరారు. ఏలూరు 6వ డివిజన్ మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఓటు పరిశీలన కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లోనూ ఇంటింటికీ వెళ్లి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ పరిధిలో ఎక్కడా అర్హులైన వారికి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రాబోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉన్నదీ, లేనిదీ పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, గృహసారథులు, కార్యకర్తలున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



డీఈఓకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తన పరిధిలో పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అబ్రహంను గురువారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అబ్రహం మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరగా ఏపీటీఎఫ్ నాయకులు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు బీఏ సాల్మన్ రాజు, టీ.రామారావు, బీ రెడ్డిదొర, ఎస్.దొరబాబు, కేఎస్ రమాదేవి, డీకేఎస్ఎస్ ప్రకాషరావు, టీ ప్రకాష్, కే ఆనంద కుమార్, ఏ శ్రీనివాసరావు, టీ శ్రీనివాసరావు, డీ బాలాంజనేయులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



గురుకుల పాఠశాల విద్యార్థిని అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ప్రతిభ కనబరిచిన గురుకుల విద్యార్థులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అభినందనలు తెలిపారు. జనవరి 26వ తేదిన ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, పెదతాడేపల్లి విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. గురువారం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంట పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాండ్ టీంకి యూనిఫారం సమకూర్చినందుకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో గురుకుల విద్యార్థులు చూపిన ప్రతిభా విద్యార్థి లోకానికి ఆదర్శనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని బహుమతులు సాధించాలని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంట ప్రసాద్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, బ్యాండ్ టీం విద్యార్థి దినేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కత్తుల రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని ఏలూరు డీ3 సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ శనివారపుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ సంస్థ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక శనివారపుపేట, శ్రీరామ్‌నగర్, విద్యానగర్, దుగ్గిరాల, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

14న గుంటూరులో అధిక జన మహాసంకల్ప సభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన సంతోష్‌కుమార్ తదితరులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 14వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలో నిర్వహించే అధిక జన మహాసంకల్ప సభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలు ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారనే, దీనిపై ఆవేదనతో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కెఆర్ విజయ్ కుమార్ తడ నుంచి తుని వరకూ సుమారు 2,750 కిలో మీటర్లు ఐక్యతాపథం పేరుతో పాదయాత్రను నిర్వహించారన్నారు. గుంటూరులో నిర్వహించే అధికజన మహా సంకల్ప సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఏవైఎస్ నాయకులు జి.సుధీర్, కనికెళ్ళ మురళీ కృష్ణ, జె.పోసిరాజు, అద్దంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ప్రయాణం చేసి విజయం సాధించామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు అన్నారు. గురువారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రజాప్రనిధులు, వివిధ శాఖల అధికారులతో నాయకులు, మండల స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు వారి అవసరాలను నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ బాబు మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకవెళ్లామని చెప్పారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తావెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టితో మోనటరింగ్ చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, పెదవేగి సొసైటీ ప్రెసిడెంట్ పెనుమాక వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి గురువారం మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో అలుగులగూడెం వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను సోదరి చికిత్స పొందుతున్న కుమారిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలు, వైద్యసేవలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులు మెరుగైన వైద్యసేవలందించాలని తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని ఉన్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణపై అవగాహన

పెదపాడు: మండలంలో జాతీయ నులిపురుగుల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టరు చక్రధర్ గురువారం విలేకరులకు తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సున్న మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలల్లోను, కళాశాలల్లోను ఫిబ్రవరి 9న నులిపురుగుల నివారణ మాత్రలను ఉచితంగా అందిస్తారని చెప్పారు. పాఠశాలలకు వెళ్లని పిల్లలకు కిశోరబాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తారని చెప్పారు. 9న మాత్ర వేయని వారంతా ఫిబ్రవరి 16న జరిగే మాప్ అప్ రోజు వేయాలని సూచించారు. మాత్ర గొంతులో ఇరుక్కోకుండా ఉండేందుకు చప్పరించి గానీ, తాగునీటితో కలిపి మింగాలని డాక్టరు చక్రధర్ సూచించారు.

హోరాహోరీగా గిరిజన క్రీడోత్సవ పోటీలు



నాటుబాణం పోటీలో తలపడుతున్న గిరిజన పెద్దలు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం జూనియర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో గిరిజన క్రీడోత్సవ పోటీలు గురువారం రెండోరోజు హోరాహోరీగా జరిగాయి. ఈ క్రీడోత్సవంలో వాలీబాల్, విలువిద్య, కబడ్డీ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో అత్యధికంగా టీమ్‌లు పాల్గొనగా రెండు బ్యాచ్‌లుగా ఈ పోటీలను జరిపారు. బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెం, మండలాల నుంచి అత్యధికంగా క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే విలువిద్య పోటీల్లో యువకులతోపాటు పెద్దలు సైతం పోటీపడ్డారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చిన పెద్దవారు నాటు బాణాలతో పోటీలో తలపడ్డారు. కబడ్డీ క్రీడాకారులు కూడా అత్యధింగా పాల్గొన్నారు. ఎంతో ఆసక్తిగా జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం





టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద జగన్నాథుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, రథంపై కొలువైన స్వామి, అమ్మవార్లు

టి.నరసాపురం: టి.నరసాపురంలో జగన్నాథస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం వడలి గ్రామానికి చెందిన జగన్నాథస్వామిని టి.నరసాపురం అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయం వద్ద బలరామ కృష్ణుడు (జగన్నాధుడు), సుభద్రాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని రథంపై గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శివాలయం వద్ద రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు, ఉత్సవ కమిటీ నాయకులు పసుమర్తి రాము, పర్వతనేని మురళి తదితరులు పర్యవేక్షించారు. ఆలయ పూజారులు వినయ్ శర్మతో పాటు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఎల్ఓల పాత్ర కీలకం

ఉంగుటూరు: ఎన్నికల సమయంలో బీఎల్ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్ఓలు పోలింగు బూత్‌లు వద్ద తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. కొత్త ఓటు కోసం చేసుకున్న దరఖాస్తు అడ్రస్సులను నిశితంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, ఎన్నికల డీటీ పోతురాజు, సీనియర్ సహాయకుడు సాయం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి



కేరళ నుంచి వచ్చిన జనరల్ కౌన్సిలర్ సిస్టర్ జూలీకి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ టీనా మరియా

దెందులూరు: విద్యతోనే అభివృద్ధి, అవగాహన ముడిపడి ఉందని, విద్యా విధానంలో నూతన ఒరవడి, నైపుణ్యతలను పెంపొందించాలని జనరల్ కౌన్సిలర్ సిస్టర్ జూలీ (కేరళ) అన్నా రు. గురువారం దెందులూరు సెయింట్ మేరీస్ యూపీ పాఠశాలల విద్యా విధానం, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు, పనితీరు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం, మౌలిక వసతుల కల్పన అన్ని రాష్ట్రాలకు మించి పోటీలో నూరు శాతం సత్ఫలితాల సాధన దిశగా ఉందన్నారు. కేరళ నుంచి పరిశీలించడానికి విచ్చేసిన జనరల్ కౌన్సిలర్‌కు ప్రిన్సిపల్ సిస్టర్ టీనా మరియా స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెదపాడు: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొక్కిరపాడులో మొక్క జొన్న పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రదీప్ కుమార్ ఎరువుల యాజమాన్యం విత్తన ఉత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సాగు చేస్తున్న పంట వివరాలను ఆర్‌బీకే సిబ్బంది ద్వారా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని పంట నమోదు ప్రాముఖ్యతను వివరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	66
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	08-10
బెండకాయలు	40	కంద	70
పచ్చిమిర్చి	30-34	బీట్‌రూట్	40
కాకర కాయలు	54	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	--	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	40	పాలకూర	10
దొండకాయలు	36	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	20-25	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34